సాక్షి ఖమ్మం

గురువారం । 8 । మే । 2025



మిర్చి ధర పతనం

నానాటికీ మిర్చి ధర పతనమవుతుండగా.. జెండాపాటతో పోలిస్తే మోడల్ ధరతోనే ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. 10లో



తలసేమియా పిల్లలకు అండగా..

తలసేమియా బాధిత చిన్నారులకు పరీక్షలు, చికిత్సలో అండగా నిలుస్తామని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి తెలిపారు. 10లో

గరిష్టం / కనిష్టం
38° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం ఎండ ప్రభావం తక్కువగా ఉంటుంది. ఆతర్వాత పెరుగుతూ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లు పరిశీలన



ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండలంలోని దమ్మాయిగూడెం, ఎదుళ్లచెరువు, సుబ్లేడుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయాధికారి ధనసిరి పుల్లయ్య బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమశాతం, కాంటా, రవాణాపై ఆరా తీశారు. నిర్దేశిత తేమ నమోదు కాగానే కాంటా వేసి కేటాయించిన మిల్లులకు తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. అకాల వర్షాల నేపథ్యాన రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలని డీఏఓ సూచించారు. ఏఓ సీతారాం రెడ్డి, పీఏసీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యుత్ అభివృద్ధి పనులపై సమీక్ష

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో విద్యుత్ సంబంధిత అభివృద్ధి పనులపై ఆ శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్షించారు. ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఈ.శ్రీనివాసాచారి, నోడల్ అధికారి నాగప్రసాద్ పర్యవేక్షణలో వీసీ నిర్వహించగా, వేసవి డిమాండ్‌కు అనుగుణంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, 33 కేవీ ఇంటర్ లింకింగ్ పనులు, విద్యుత్ భద్రతా వారోత్సవాలు, 33 కేవీ, 11 కేవీ లైన్ల నిర్వహణపై చర్చించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాల డీఈలు బాబురావు, భద్రుపవర్, నంబూరి రామారావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, రాములు, హీరాలాల్, ఏడీఈలు పాల్గొన్నారు.

ఏఎంబీఐఎస్‌పై పోలీసులకు శిక్షణ



శిక్షణ ఇస్తున్న అధికారులు

ఖమ్మంక్రైం: ఆటోమేటెడ్ మల్టీ మోడల్ బయోమెట్రిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్(ఏఎంబీఐఎస్)పై పోలీసు ఉద్యోగులకు ఖమ్మంలో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా క్లూస్‌టీమ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ నేరం జరిగిన ప్రదేశం నుంచి నుండి నిందితుల వేలిముద్రలు తదితర ఆధారాల సేకరణ, ఐరిస్ స్కాన్ డేటా ఆధారంగా నిందితుల గుర్తింపునకు ఏఎంబీఐఎస్ ఉపయోగపడుతుందని ఎలిపారు. కొత్త క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్ అమల్లో భాగంగా ఈ వ్యవస్థను అప్‌గ్రేడ్ చేశారని చెప్పారు. నేరం జరిగిన ప్రదేశంలో వేలిముద్రల ఆధారంగా నేరస్తుల గుర్తింపు నూరు శాతం కచ్చితత్వంతో ఉంటుందని వెల్లడించారు.

వెదురు ఉత్పత్తుల ప్రదర్శన



ప్రదర్శనలో పాల్గొన్న మేనేజర్లు, ఉద్యోగులు

సత్తుపల్లిటౌన్: తెలంగాణ అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పడి పదేళ్లు అవుతున్న సందర్భంగా సత్తుపల్లి వెదురు డిపోలో బుధవారం దశాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెదురు విత్తనాలు, ఉత్పత్తులను ప్రదర్శించారు. అనంతరం 33లాట్ల వెదురు వేలం వేయగా, రూ.15.64 లక్షల ఆదాయం నమోదైంది. సత్తుపల్లి, పాల్వంచ డివిజనల్ మేనేజర్లు గణేష్, కవిత, డాక్టర్ శ్రీనివాస్, రేంజర్లు నాగరాజు, చంద్రకళ, బ్రహ్మాచారి, గోపిప్రసాద్, సిద్ధార్థకుమార్ తదితరులు పాల్గొన్నారు.

10లోపు దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: త్వరలో ఏర్పాటయ్యే ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ సెంటర్ల(ఈడీసీ)లో పని చేసేందుకు ఆసక్తి ఉన్న ఈనెల 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. ఎంఎస్ఎంఈల పనితీరులో వేగం పెంచేలా జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద ఈడీసీలు ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల మార్కెట్ పెంపు, రుణాల సమీకరణ, అభివృద్ధికి ఇవి తోడ్పాటునిస్తాయని, ఇందులో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్‌ను నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హతలు ఉన్నవారు 10వ తేదీలోగా దరఖాస్తులను సమర్పించాలని, వివరాలకు www.nimsme.gov.in వెబ్‌సైట్‌లో లేదా కలెక్టరేట్‌లోని పరిశ్రమల శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.



జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి

జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రితో పాటు పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లు, బస్తీ, పల్లె దవాఖానాలను సమస్యలు వేధిస్తున్నాయి. నిధులు, నియామకాలు జరగక, శస్త్రచికిత్స పరికరాలు, రసాయనాల సరఫరా లేక పేదలకు మెరుగైన వైద్యం అందడంలేదు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతోపాటు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల నుంచి ఇక్కడకు జనాలు వస్తుండగా, వైద్యులు, నిపుణులు లేకపోవడమే కాక శస్త్రచికిత్స పరికరాలు, పరీక్షలకు అవసరమైన రసాయనాలు అందుబాటులో లేవు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యాన ఆస్పత్రుల్లో సమస్యలపై దృష్టి సారించి పరిష్కారానికి దారి చూపాలని పేదలు కోరుతున్నారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

చికిత్స అత్యవసరం

పెద్దాస్పత్రిలో వైద్యుల కొరత, పెండింగ్ బిల్లులతో సతమతం

- ఇతర దవాఖానాల్లోనూ వెంటాడుతున్న సమస్యలు
- నేడు జిల్లాకు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- డిప్యూటీ సీఎం, మంత్రులతో కలిసి మెడికల్ కాలేజీ భవనాలకు శంకుస్థాపన

క్యాథ్‌ల్యాబ్ సేవలు అందక..

ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లోని గుండె సంబంధిత బాధితులు ఇక్కడకు వస్తున్నారు. కానీ ఆస్పత్రిలోని క్యాథ్‌ల్యాబ్ తరచూ పనిచేయడం లేదు. ఫలితంగా ఖరీదైన గుండె వైద్యం కోసం స్థోమత ఉన్న వారు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తుండగా.. మిగతా వారు దేవుడిపై భారం వేసి గడుపుతున్నారు.

ఎస్ఎన్‌సీయూలో పనిచేయని వార్మర్లు

ఆస్పత్రిలోని ఎస్ఎన్‌సీయూ(స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్)లో వార్మర్లు సరిపడా లేవు. బరువు తక్కువగా పుట్టిన పిల్లలకు ఇక్కడ చికిత్స చేస్తారు. జిల్లాలోని ఇతర ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల నుంచి వచ్చే చిన్నారులను ఇక్కడకు తీసుకొస్తారు. కానీ 20 వార్మర్లే ఉండగా.. అందులో 10 పనిచేయక అత్యవసర పరిస్థితుల్లో చిన్నారులను ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోంది.

ఎంఆర్ఐ లేనేలేదు...

ఎంఆర్ఐ పరీక్షకు రూ.వేలల్లో ఖర్చవుతుంది. కానీ ఖమ్మం ఆస్పత్రికి ఎంఆర్ఐ యంత్రం కేటాయించకపోవడంతో రోగులు ప్రైవేట్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తుంది. ఖమ్మం ఆస్పత్రిలో రోజుకు 1,500 మందికి పైగానే వైద్య సేవలు అందిస్తున్నారు. కానీ ఎంఆర్ఐ మిషన్ లేక ప్రైవేట్ సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే, గర్భిణుల్లో పిండం ఎదుగుదలను గుర్తించే టిఫా మిషన్ లేకపోగా, రేడియాలజిస్ట్ కూడా లేకపోవడం గమనార్హం.

ఇక్కడ కూడా అదే పరిస్థితి..

జిల్లాలో 28 పీహెచ్‌సీలు, 161 పల్లె దవాఖానాల్లోనూ అనేక సమస్యలు వేధిస్తున్నాయి. పీహెచ్‌సీల్లో 23 మంది వైద్యుల అవసరం ఉంది. పల్లె దవాఖానాల్లో 90 మంది వైద్యులు ఉండగా, ఇంకా 71 పోస్టులు భర్తీ చేయాలి. మొదటి, సెకండ్ ఏఎన్ఎంలు కలిపి 450 మందికి 399 మందే పనిచేస్తున్నారు. ప్రతీ వెయ్యి మందికి ఒక ఆశా వర్కర్ ఉండాల్సి ఉన్నా మరో 650 మందిని నియమించాల్సి ఉంది. అలాగే, జిల్లాలో కొత్తగా నాలుగు పీహెచ్‌సీల ఏర్పాటు, సబ్ సెంటర్లకు నూతన భవనాల నిర్మాణం, ఇతర మరమ్మతుల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.



మాతాశిశు ఆరోగ్య కేంద్రం

నేడు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి పర్యటన

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం ఖమ్మంలో పర్యటించనున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఉదయం 10గంటలకు రఘునాథపాలెంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పరిశీలించి, మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్యశాఖపై సమీక్షించనున్నారు.

రసాయనాలు లేక...



తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్ (టీ–హబ్)

జిల్లా ఆస్పత్రిలోని టీ–హబ్‌లో పూర్తిస్థాయిలో పరీక్షలు నిర్వహించడం లేదు. పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, పల్లె దవాఖానాల నుంచి ఇక్కడకు శాంపిల్స్ పంపిస్తే 24 గంటల్లో పరీక్షల చేసి నివేదికను రోగుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో పంపాలి. అయితే, రసాయనాల కొరతతో ఇక్కడ 134 రకాల పరీక్షలకు గాను కేవలం 40 పరీక్షలే నిర్వహిస్తున్నారు.



రేడియాలజీ హబ్

వైద్యుల కొరత

ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల కొనసాగుతోంది. ఆస్పత్రిలో 173 మంది వైద్యులకు గాను 121 మందే విధులు నిర్వర్తిస్తున్నారు. 36 మంది ప్రొఫెసర్లకు 14మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 56 మందికి 45 మంది, 59 మంది సీనియర్ రెసిడెంట్ వైద్యులకు 40మంది మాత్రమే ప్రస్తుతం విధుల్లో ఉన్నారు. ఇక శస్త్రచికిత్సలు, మందులు, ఆక్సిజన్, డైట్ చార్జీలు, స్టేషనరీ, పెట్రోల్, వాహనాల మరమ్మతుల ఇలా చెబుతూ పోతే వివిధ బిల్లులు గడిచిన ఏడాది కాలంగా రూ.9,20,80,000 పెండింగ్ ఉన్నాయి.



పాత కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న మెడికల్ కాలేజీ



ప్రభుత్వ మెడికల్ కాలేజీ నమూనా

ఇదే మెడికల్ కాలేజీ !



శంకుస్థాపన ప్రాంగణంలో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



పెద్దాస్పత్రిలో ఏర్పాటన్లు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంఅర్బన్: రఘునాథపాలెం బైపాస్‌లోని బల్లేపల్లి వద్ద ప్రభుత్వ మెడికల్ కాలేజీ భవన నిర్మాణాలకు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు పాల్గొననుండగా.. శంకుస్థాపన తర్వాత సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈమేరకు కార్పొరేట్ తరహాలో నిర్మించే భవనం నమూనాను విడుదల చేశారు. కాగా, సభ ఏర్పాట్లను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవా రం సాయంత్రం పరిశీలించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యాకూబ్, ఈఈ యుగంధర్ పాల్గొన్నారు.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ మెడికల్ శంకుస్థాపనకు హాజరవుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జిల్లా పెద్దాస్పత్రిని కూడా తనిఖీ చేయనున్నారు. ఆతర్వాత కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షిస్తారు. ఈ సందర్భంగా పెద్దాస్పత్రిలో ఏర్పాట్లను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేయించడమే కాక శాఖకు సంబంధించి నివేదికలు సిద్ధం చేయాలని అధికారులు, వైద్యులకు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఈఈ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మా ధాన్యం ఎప్పుడు కాంటా వేస్తారు?

తల్లాడలో రైతుల రాస్తారోకో



రహదారిపై బైఠాయించిన రైతులు, నాయకులు

తల్లాడ: తల్లాడ మండలం కుర్నవల్లి పరిసర గ్రామాల్లోని నెల రోజులుగా కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని ఆరోపిస్తూ రైతులు బుధవారం ఆందోళనకు దిగారు. కుర్నవల్లిలోని కేంద్రానికి 120 లారీల మేర ధాన్యం తీసుకురాగా.. కాంటాలో జాప్యంతో ఇంకా 80 లారీల ధాన్యం మిగిలిపోయింది. ఇంతలోనే అకాల వర్షాలతో రైతులు పంటను కాపాడుకునేందుకు అష్టకష్టాలు పడుతున్నా.. గన్నీ సంచులు, లారీలు లేవని అధికారులు తాత్సారం చేస్తున్నారు. దీంతో రైతులు బుధవారం మధ్యాహ్నం మండుటెండలో తల్లాడ చేరుకుని ప్రధాన రహదారిపై ట్రాక్టర్లు అడ్డుగా పెట్టి రాస్తారోకోకు దిగారు. ఈమేరకు అటు కల్లూరు, ఇటు వైరా రోడ్లలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ట్రెయినీ ఎస్ఐ వెంకటేశ్, సిబ్బంది చేరుకుని వారికి నచ్చచెప్పినా తహసీల్దార్ వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పే వరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదని తేల్చిచెప్పారు. ఈక్రమాన బలవంతంగా రైతులను లేపే ప్రయత్నం చేయగా ఇరువర్గాల వాగ్వాదంతో ఉద్రిక్తత నెలకొంది. ఇంతలోనే తహసీల్దార్ సురేష్‌కుమార్ చేరుకుని పౌర సరఫరాల సంస్థ డీఎం శ్రీలత, ఆర్డీఓ రాజేందర్‌గౌడ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఒకటి, రెండు రోజుల్లో 40లారీలు, సరిపడా గన్నీ సంచులు పంపిస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు శీలం సత్యనారాయణరెడ్డి, కళ్యాణపు కృష్ణయ్య, కట్టా దర్గయ్య, షేక్ మస్తాన్, చల్లా నాగేశ్వర్‌రావు, ఎస్.వీ.రాఘవులు, కట్టా కృష్ణారావు, చలపతిరెడ్డి, మాధవరావు, లక్ష్మారెడ్డి, బద్దం నాగిరెడ్డి, అయిలూరి సత్యనారాయణరెడ్డి, వరకిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భరతమాత సేవలో.. మేము సైతం..



- యుద్ధం వస్తే పాల్గొనేందుకు సిద్ధం
- ఎప్పుడు పిలుపు వచ్చినా వెళ్తామంటున్న మాజీ సైనికులు
- 'ఆపరేషన్ సిందూర్'పై జిల్లా వాసుల్లో హర్షాతిరేకాలు

ఖమ్మంమయూరిసెంటర్: భరతమాతకు సేవచేసే అవకాశం వస్తే కదనరంగంలోకి దూకేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని మాజీ సైనికులు స్పష్టం చేశారు. దేశ రక్షణతో పాటు శత్రుమూకలకు బుద్ధి చెప్పేందుకు తమను పిలిస్తే గొప్పగా భావిస్తామని తెలిపారు. పాకిస్తాన్, పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో దాడులు చేయడంపై మాజీ సైనికులు హర్షం వ్యక్తం చేశారు. ఏళ్లుగా పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు దిగుతున్నా భారత్ సంయమనం పాటించిందని.. ఇప్పుడు అమాయకులను కాల్చిచంపడంతో 'ఆపరేషన్'కు దిగడం సరైన చర్య అని అభిప్రాయపడ్డారు. ఇదికాక యుద్ధం చేయాల్సి వచ్చినా భారత సైన్యం సిద్ధంగా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. 'ఆపరేషన్ సిందూర్' నేపథ్యాన జిల్లాలోని మాజీ సైనికులను పలకరించగా తమ అభిప్రాయాలు వెల్లడించారు.

సర్జికల్ స్ట్రైక్స్ అవసరం



మిలిటెంట్ గ్రూపులన్నీ మన సైనికులు, పౌరులపై దాడులకు దిగుతున్నాయి. ఇలాంటి సమయాల్లో సర్జికల్ స్ట్రైక్ అవసరం. అయితే, ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు ఆందోళన ఎదురవుతుంది. అంతర్జాతీయంగా ఒత్తిడి తీసుకొచ్చి పాక్‌ను దెబ్బతీయాలి. – మెహబూబ్ సుబాని, ఖమ్మం

శత్రుదేశాలకు ఇది హెచ్చరిక..



మహిళల నుదుటి సింధూరం ఆరకముందే పాక్‌లోని ఉగ్ర శిబిరాలను నిర్మూలించడం మామూలు విషయం కాదు. ఇది శతృదేశాలకు హెచ్చరిక. నేను సరిహద్దులో ఏడేళ్ల విధులు నిర్వర్తించా. మళ్లీ యుద్ధం వచ్చి నన్ను పిలిస్తే గర్వంగా భావిస్తా. – బిందు వీరబాబు, బాణాపురం

సైన్యంతో కలిసేందుకు రెడీ



భారత్ యుద్ధం చేయాల్సి వచ్చి, మాజీ సైనికులను ఆహ్వానిస్తే పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా. ప్రస్తుతం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పాక్‌కు గుణపాఠం. అమాయకులను బలిగొంటున్న ఉగ్రవాదులను అణచివేయాల్సిన అవసరముంది. – కరివేద రాజేష్, ఖమ్మం

ఇది భారత విజయం



పాక్‌లోని తీవ్రవాద స్థావరాలపై మన సైన్యం దాడి చేయడం గొప్ప విజయం. సామాన్యులను హతమార్చిన తీవ్రవాదులకు ఇది గుణపాఠం. పాకిస్తాన్ లేదా తీవ్రవాదులు భారత్‌వైపు చూస్తే మన సైన్యం సమాధానం చెప్పడానికి సిద్ధంగా ఉంటుంది. – కంచర్ల ప్రసాద్, గొల్లెనపాడు

ఇదే సరైన సమాధానం



ఉగ్రవాదులను అడ్డు పెట్టుకుని కవ్వింపు చర్యలకు దిగుతున్న పాక్‌కు ఇది సరైన సమాధానం. ఆ దేశానికి పాఠం చెప్పేలా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గొప్పది. ఆర్మీ నుండి బయటకొచ్చి ఎనిమిదేళ్లయినా మళ్లీ ఆదేశాలు వస్తే వెంటనే వెళ్తా. – బోయపాటి రామకృష్ణ, ఖమ్మం

ముల్లును ముల్లుతోనే తీసినట్లు..



పహల్గామ్‌లో ప్రాణాలు కోల్పోయిన అమాయక కుటుంబాలకు ఆపరేషన్ సిందూర్‌తో ఊరట లభించింది. ముల్లును ముల్లుతోనే తీసినట్లు పాక్ తీవ్రవాదులకు మన సైన్యం గట్టి జవాబు ఇచ్చింది. దేశంమొత్తం సైన్యానికి అండగా నిలవాల్సిన సమయం ఇది. – అమరనేని మురళి, గొల్లెనపాడు



బోనకల్‌లో జాతీయ జెండాలతో రైల్వే ఉద్యోగులు

సంబురాలు..

బోనకల్/ఏన్కూరు: పాక్‌లోని ఉగ్రస్థావరాలపై 'ఆపరేషన్ సింధూర్' పేరిట భారత సైన్యం దాడి చేయడంపై జిల్లాలోని పలుచోట్ల సంబురాలు జరుపుకున్నారు. బోనకల్ స్టేషన్‌లోని టీఆర్‌డీ కార్యాలయంలో ఉద్యోగులు జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. రైల్వే ఎస్ఎస్ఈ మోతేష్, జేఈ శరత్ మాట్లాడగా ఉద్యోగులు ప్రభాకర్, ఓంప్రకాశ్, సుధారాణి, ప్రవీణ, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఏన్కూరులో బీజేపీ నాయకుల ఆధ్వర్యాన బాణసంచా పేల్చి సంబురాలు నిర్వహించారు. నాయకులు కొవ్వూరి నాగేశ్వరావు, నల్లబోతుల రమేష్, బానోతు బాలాజీ, పొట్లంపల్లి శ్రీనివాసరావు, దేవిశెట్టి కృష్ణారావు, నంబూరి నాగేశ్వరావు, పసుమర్తి రాధకృష్ణ, మోరబోయిన కృష్ణ, వజినేపల్లి దర్గయ్య, సింహాచలం పాల్గొన్నారు.



ఏన్కూరులో బాణసంచా కాలుస్తున్న బీజేపీ నాయకులు

క్లుప్తంగా

టీపీసీసీ లీగల్ సెల్‌లో జిల్లా న్యాయవాది


చంద్రశేఖర్‌గుప్తా

ఖమ్మంలీగల్/ఎర్రుపాలెం: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్ సెల్ హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ కన్వీనర్‌గా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన న్యాయవాది కోన చంద్రశేఖర్‌గుప్తా నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రశేఖర్‌గుప్తా గతంలో ఖమ్మం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ రఘురాంరెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు పందిళ్లపల్లి విద్యార్థిని


దీక్షిత

చింతకాని: మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలో ఈ నెల 9వ తేదీ నుంచి జరగనున్న 51వ జాతీయస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో చింతకాని మండలం పందిళ్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కేతవరపు దీక్షిత పాల్గొననుంది. తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టుకు ఆమె ఎంపికైందని పాఠశాల హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా దీక్షితను హెచ్‌ఎంతో పాటు పీడీ కృష్ణారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

మానవత్వం చాటుకున్న యువకులు


నగదు అందజేస్తున్న యువకులు

తల్లాడ: మండలంలోని మిట్టపల్లిలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో నలుగురు మృతి చెందగా, ఇంకో ఇద్దరు తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈమేరకు మిస్సైల్ మ్యాన్ హెల్పింగ్ హ్యాండ్స్ యూత్ ఆధ్వర్యాన సేకరించిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. ప్రమాద బాధితుడు గుత్తికొండ వినోద్‌ను పరామర్శించి ఆయన భార్య రేవతికి నగదు అందజేశారు. సంస్థ బాధ్యులు వడ్డానపు నరేశ్, పొన్న శ్రీకాంత్, చిట్టెం బ్రహ్మం, అజయ్, మారేశ్, పెంట్‌సాహెబ్, బాలు పాల్గొన్నారు.

యూటీ పనులు ప్రారంభం


యూటీ పునర్నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అధికారులు

కూసుమంచి: గతేడాది వచ్చిన వరదలతో పాలేరు రిజర్వాయర్ ఔట్‌ఫ్లో కాల్వ (ఎడమ కాల్వ) కట్టకు మత్స్య పరిశోధనా కేంద్రం సమీపాన యూటీ (అండర్ టన్నెల్) వద్ద భారీ గండి పడింది. అప్పట్లో గండిని తాత్కాలికంగా పూడ్చివేసిన అధికారులు, ప్రస్తుతం కొత్తగా యూటీ నిర్మాణ పనులు మొదలుపెట్టారు. రూ.10 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులను బుధవారం జల వనరుల శాఖ ఎస్ఈ మంగళంపూడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. కాల్వ ద్వారా ఖమ్మం నగరానికి విడతల వారీగా తాగునీరు సరఫరా చేయనుండగా ప్రస్తుత పనులతో ఏమైనా అవాంతరాలు ఎదురవుతాయా అని కేఎంసీ ఇంజనీర్ రంజిత్‌తో ఎస్ఈ చర్చించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా జరిగేందుకు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని నిర్ణయించారు. జల వనరుల శాఖ ఈఈ అనన్య, డీఈఈ అనన్య, డీఈఈలు మాధవి, మధు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	2,050
పెసలు	7,027	4,100
కందులు	6,300	6,300
మినుములు	6,175	6,175
మిర్చి	13,350	6,000
మిర్చి తాలు	5,900	4,500
పత్తి	7,550	6,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.20,058

మిర్చి ధర పతనం

- రూ.10 వేలకు పడిపోయిన మోడల్ ధర
- గరిష్ట ధర రూ.13 వేలు దాటుతున్నా కొందరికే..
- నాణ్యత పేరిట తగ్గిస్తున్న వ్యాపారులు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో విక్రయానికి తీసుకొచ్చిన మిర్చి

ఖమ్మంవ్యవసాయం: మిర్చి ధర రోజురోజుకూ మరింతగా పతనమవుతోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో గత వారం వరకు మిర్చి జెండాపాట ధర రూ.13,500 పలకగా, కొద్ది రోజులుగా రూ.13 వేల నుంచి రూ.12,850 మధ్య కొనసాగుతోంది. ఇక రూ.12 వేల వరకు పలికిన మోడల్ ధర కొద్ది రోజులుగా రూ.10 వేలు దాటడం లేదు. మార్కెట్‌లో వ్యాపారులు అధికంగా మోడల్ ధరతోనే కొనుగోలు చేస్తారు. కనిష్ట ధరలు మరింత దయనీయంగా ఉన్నాయి. ఇది రూ.5,800కు మించి దాటకపోవడం గమనార్హం.

గత ఏడాదితో పోలిస్తే దయనీయం

మిర్చి ధర గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది బాగా తగ్గింది. గత ఏడాది సీజన్‌లో క్వింటా మిర్చి రూ.20 వేల వరకు పలకగా.. ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచే ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. తొలినాళ్లలో రూ.15,500 వరకు ధర పలకగా, క్రమక్రమంగా పతనమవుతోంది. మార్చి నుంచి మరింత పతనం దిశగా కొనసాగుతోంది. ఖమ్మం మార్కెట్‌లో తేజా రకం మిర్చి కొనుగోళ్లకు పేరు ఉండగా.. ఇక్కడి వ్యాపారులు చైనా, తదితర దేశాలకు ఎగుమతి చేస్తారు. ప్రస్తుతం మార్కెట్‌కు 40 నుంచి 50 వేల బస్తాల మిర్చి వస్తోంది.

మోడల్ ధరకే అధిక కొనుగోళ్లు

మార్కెట్‌లో జెండా పాట విధానం ద్వారా మిర్చికి ధర ఖరారు చేస్తారు. పంటకు డిమాండ్, నాణ్యతా ప్రమాణాల పేరిట వ్యాపారులు మోడల్ ధరతోనే అధికంగా కొనుగోలు చేస్తున్నారు. జెండాపాట ధర తో పోలిస్తే దాదాపు రూ.3వేలు తగ్గిస్తుండగా.. రూ. 10 వేలు అంతకన్నా తక్కువ ధరతోనే కొనుగోలు చేస్తుండడంతో రైతులకు నష్టం ఎదురవుతోంది.

చైనా నుంచి డిమాండ్ లేకనే..

తేజా రకం మిర్చి ధర చైనాలో ఉన్న డిమాండ్‌పై ఆధారపడి ఉంటుంది. ఆ దేశం నుంచి ఆర్డర్ల ఆధారంగా ఎగుమతిదారులు ఇక్కడ ధర నిర్ణయిస్తారు. కానీ, ఈ ఏడాది చైనా నుంచి ఆశించిన స్థాయిలో ఆర్డర్లు లేక తేజామిర్చికి డిమాండ్ పడిపోయింది. అంతేకాక ఇప్పుడు చివరి కోతలు కావడంతో నాణ్యత లేకపోవడం ఇంకో కారణంగా చెబుతున్నారు. కానీ, దీన్ని సాకుగా చూపుతూ పంట నాణ్యతగా ఉన్నా వ్యాపా రులు ధరలో మరింతగా కోత పెడుతున్నారు. ఈ మేరకు ధర గిట్టుబాటు కాకపోవడంతో పలువురు రైతులు నాణ్యమైన పంటను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేస్తున్నారు.

ఈ ఏడాది సీజన్‌లో ఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధరలు

తేదీ	గరిష్ట ధర (రూ.ల్లో)	మోడల్ ధర (రూ.ల్లో)
నవంబర్ 6	18,000	17,500
డిసెంబర్ 9	16,500	16,000
జనవరి 17	15,500	15,000
ఫిబ్రవరి 2	14,200	13,700
మార్చి 18	13,700	12,000
ఏప్రిల్ 2	13,300	12,000
ఏప్రిల్ 15	13,500	11,000
ఏప్రిల్ 29	13,400	10,500
ఏప్రిల్ 30	12,850	10,000
మే 7	13,350	10,000

పహల్గాం బాధితుల కెరటమే 'సిందూర్'

బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సుధాకర్‌రెడ్డి, నాయకులు

వైరా: పహల్గాం ఉగ్ర దాడిలో సర్వం కోల్పోయిన ఆడపడుచుల కన్నీటి నుంచి రాలిపడిన కెరటమే 'ఆపరేషన్ సిందూర్'అని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి అన్నారు. పాకిస్తాన్ టెర్రరిస్టు స్థావరాలపై దాడి విజయవంతమైన నేపథ్యాన బుధవారం వైరాలోని సాయిబాబా దేవాలయంలో సైనికులకు మనోధైర్యం కలిగించాలని యాగం చేశారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశాక బీజేపీ మండల అధ్యక్షుడు మనుబోలు వెంకటకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కులగణన అవగాహన సదస్సులో మాట్లాడారు. దేశ ప్రజల జోలికొస్తే ఎంతటి చర్యలకైనా వెనకాడేది లేదని ప్రధాని మోదీ నిరూపించారని తెలిపారు. మోదీ స్ఫూర్తిగా తీసుకుని బీజేపీ శ్రేణులు దేశాభివృద్ధిలో పాలుపంచుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, నున్నా రవి, మందడపు సుబ్బారావు, అల్లిక అంజయ్య, దొడ్డా అరుణ, పమ్మి అనిత, వీరవెల్లి రాజేశ్‌గుప్త, నల్లగట్ల ప్రవీణ్, రవి రాథోడ్, పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాల్సిందే

సీపీఐ జాతీయ సమితి సభ్యుడు హేమంతరావు


సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

ఖమ్మంమయూరిసెంటర్: పహెల్గాం దాడి తర్వాత దేశంలో యుద్ధ వాతావరణం నెలకొందని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా దానిని తుదముట్టించాల్సిందేనని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు స్పష్టం చేశారు. ఖమ్మంలో బుధవారం జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పహెల్గాం ఘటన తర్వాత సరిహద్దుల్లో ఉద్రిక్తత చోటు చేసుకుంటోందని తెలిపారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. అదే సమయాన ఉద్రిక్తతను మనోన్మాదులు అవకాశంగా తీసుకోకుండా చూడాలని కోరారు. కాగా, ప్రధాని మోదీ పేదలు, వ్యవసాయ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించి సంపన్న వర్గాలపై దృష్టి సారించారని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలులో జాప్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. అలాగే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై సీఎం వ్యాఖ్యలు చర్చనీయాంశం కాగా, భవిష్యత్‌లో ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని హేమంతరావు పేర్కొన్నారు. సీపీఐ శత వసంతాల ముగింపు సభ ఖమ్మంలో జరగనుండగా, ఆలోపే మండల, జిల్లా మహాసభలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో నాయకులు దండి సురేశ్, మహ్మద్ మౌలానా, బెజవాడ రవి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర శిబిరాలపై వైమానిక దాడులు అభినందనీయం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదన్

ఖమ్మంమయూరిసెంటర్: పాకిస్తాన్‌లోని ఉగ్రశిబిరాలపై భారత్ జరిపిన వైమానిక దాడి అభినందనీయమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి మాట్లాడారు. దశాబ్దాలుగా పాకిస్తాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తుండగా, కొన్ని దేశాలు సహకరిస్తున్నాయని తెలిపారు. ఉగ్రవాదం లేని ప్రపంచమే బీఆర్‌ఎస్ విధానం అయినందున భారత సైన్యం చేపట్టిన చర్యలను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. భవిష్యత్‌లోనూ సైన్యానికి తమ మద్దతు సంపూర్ణంగా ఉంటుందని తెలిపారు. కాగా, ఈనెల 9న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తల్లాడలో జరిగే రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణకు హాజరవుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు బానోతు చంద్రావతి, కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణంతో పాటు ఖమర్, బెల్లం వేణుగోపాల్, నాగరాజు, భాషబోయిన వీరన్న, ఉప్పల వెంకటరమణ, బిచ్చాల తిరుమల్‌రావు, బొమ్మెర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా పిల్లలకు అండగా ఉంటాం..

డీఎంహెచ్‌ఓ కళావతిబాయి, ఏసీపీ నర్సయ్య


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యంవిభాగం: తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు తల్లిదండ్రులతోపాటు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అండగా నిలుస్తున్నందున తల్లిదండ్రులు ఆవేదన చెందొద్దని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి సూచించారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ప్రపంచ తలసేమియా దినోత్సవాన్ని ఖమ్మంలోని ఐఎంఏ హాల్‌లో బుధవారం నిర్వహించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జిల్లాలో తలసేమియా బాధిత చిన్నారుల గుర్తింపునకు సర్వే జరుగుతోందని, పాజిటివ్‌గా తేలిన వారికి చికిత్స అందిస్తామని తెలిపారు. అయితే, తలసేమియా నిర్మూలన, పిల్లల కోసం రక్తదానం చేసేందుకు అందరూ ముందుకు రావాలని సూచించారు. ఏఆర్ ఏసీపీ ఎస్.నర్సయ్య మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారులకు సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఒలీవ్ క్రిప్టో సిస్టమ్స్ సీఈఓ జి.భారవి మాట్లాడుతూ.. తలసేమియా చిన్నారులకు అండగా నిలిచేలా సంకల్ప సంస్థ కార్యక్రమాల్లో భాగస్వామ్యమవుతానని తెలిపారు. ఈ మేరకు జేఈఈ మెయిన్స్ ఎస్టీ కేటగిరీలో ఆల్ ఇండియా 21వ ర్యాంక్ సాధించిన తలసేమియా చిన్నారి అర్జున్, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను సత్కరించారు. సంస్థ బాధ్యురాలు ప్రొద్దుటూరి అనిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తలసేమియా ప్రోగ్రాం ఆఫీసర్ వెంటరమణ, వైద్యులు డి.నారాయణమూర్తి, జంగాల సునీల్‌కుమార్, కొల్లి అనుదీప్, సాయిభార్గవ్, జాబిశెట్టి రేణుక, లక్ష్మీదీపతో పాటుపోలా శ్రీనివాస్, శాంతి, పులిపాటి ప్రసాద్, పావని, కస్తూరి, పి.రవిచంద్ర, పి.ఉదయ్‌భాస్కర్, పి.వంశీకిరిటి, పి.ప్రియ, ఎస్.ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మార్క్సిజంతోనే సమస్యల పరిష్కారం

రాఘవయ్య సంస్మరణ సభలో తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న వీరభద్రం

ఖమ్మంసహకారనగర్: ప్రపంచంలోని సమస్త మానవాళి సమస్యలకు పరిష్కారం మార్క్సిజమేనని, ఆ మార్క్సిజాన్ని నమ్ముకుని రావిళ్ల రాఘవయ్య తుదికంటా పోరాడారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఖమ్మం శ్రీనివాసనగర్‌లో బుధవారం జరిగిన యూటీఎఫ్ వ్యవస్థాపకులు, జిల్లా పూర్వ అధ్యక్షుడు రాఘవయ్య సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఉన్నత ఆదర్శాలను జీవితాంతం కొనసాగించిన రాఘవయ్యను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ రంజాన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దుర్గాభవానితో పాటు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావు, ఎర్రా శ్రీనివాసరావు, పారుపల్లి నాగేశ్వరరావు, రాంబాబు, బి.రాందాస్, ఎం.నర్సయ్య, పి.సురేశ్, వలీ, యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ లబ్ధిదారులకు సరుకుల పంపిణీ


చెరువుమాధారంలో లబ్ధిదారుల ఇంటి వద్ద సరుకులు ఇస్తున్న టీచర్

నేలకొండపల్లి: ఎండల తీవ్రత నేపథ్యాన అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించారు. గతంలోనూ సెలవులు ప్రకటించినప్పటికీ నెలలో వంతుల వారీగా టీచర్, ఆయా విధులు నిర్వర్తిస్తూ లబ్ధిదారులకు పోషకాహారం వండి వడ్డించేవారు. ఈసారి అందుకు భిన్నంగా నెలకు సరిపడా సరుకులు పంపిణీ(టేక్ హోం రేషన్) చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో చిన్నారులకు కోడిగుడ్లు, బాలామృతం, బాలింతలు, గర్భిణులకు బియ్యం, పప్పు, నూనెతో పాటు పాలు, గుడ్లు అందిస్తున్నారు. జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఆరునెలల నుంచి ఆరేళ్ల వరకు పిల్లలు 54,712 మంది, గర్భిణులు, బాలింతలు 12,715 మంది ఉండగా, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో సరు కులు అందిస్తున్నామని జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్ రెడ్డి తెలిపారు.



పాలేరులో అలల సవ్వడి

సాయంకాలం.. సాగరతీరం అని పాడుకోవడానికి జిల్లాలో సముద్రం లేదు! కానీ కూసుమంచి మండలంలోని పాలేరు రిజర్వాయర్ వద్దకు వెళ్తే ఈ పాట పాడుకోవచ్చు!! రిజర్వాయర్‌లో మండు వేసవిలోనూ 18 అడుగుల మేర నీరు నిల్వ ఉండడంతో పాటు సాయంత్రం గాలులకు అలల మాదిరి నీరు ఎగిసిపడుతోంది. మేఘాలు కమ్మేసినప్పుడు నీరు సముద్రం మాదిరి రంగు సంతరించుకుంటుండడంతో వాహనదారులు ఆగి కాసేపు గడుపుతున్నారు. – కూసుమంచి

నెమళ్ల కోసం మందు పెట్టిన దుండగులు

నాలుగు ఆవులు మృతి


చింతపల్లిలో మృతి చెందిన ఆవు

ఖమ్మంరూరల్: మండలంలోని చింతపల్లిలో పొలాల వద్ద నెమళ్ల కోసం గుర్తుతెలియని వ్యక్తులు మందు పెట్టగా, ఆ మందు తినడంతో నాలుగు ఆవులు మృతి చెందాయి. గ్రామానికి చెందిన కొందరు రైతులు తమ ఆవులను మేత కోసం విడిచి పెట్టారు. ఆ ప్రాంతంలో నెమళ్లు తిరుగుతున్నాయనే సమాచారంతో దుండగులు అక్కడ ఉన్న గడ్డిపై మందు చల్లారు. అదే ప్రాంతానికి వెళ్లిన నాలుగు పశువులు గడ్డి మేయడంతో మృతి చెందాయి. ఈ విషయమై వెటర్నరీ వైద్యుడు హరీశ్‌ను వివరణ కోరగా విషపూరితమైన గడ్డి తినడంతోనే ఆవులు మృతి చెందాయని తెలిపారు. అలాగే, రైతులు వేసవిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎక్కువ మోతాదులో అన్నం, వడ్లు, బియ్యం, మొక్కజొన్న పెడితే అరగక పొట్ట ఉబ్బి పశువులు మృతి చెందే అవకాశం ఉందని తెలిపారు.

విత్తన ఏజెంట్ మోసం చేశాడని రైతుల ఆగ్రహం

కొణిజర్ల: పంటకు మంచి ధర చెల్లిస్తామని చెప్పి, ఇప్పుడు ముఖం చాటేసిన కంపెనీ ప్రతినిధులు, ఏజెంట్లపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాక వారు వివరాలు వెల్లడించారు. కొణిజర్ల మండలం తీగలబంజరకు చెందిన ఓ వ్యక్తి రెండు కంపెనీలకు చెందిన ఆడ, మగ రకం మొక్కజొన్న విత్తనాలను కొణిజర్ల, వైరా, కారేపల్లి, జూలూరుపాడు మండలాల్లో పలు గ్రామాల రైతులకు ఇచ్చాడు. కానీ, సరైన దిగుబడి రాకపోవడంతో ఆందోళన చేయగా పరిహారం ఇప్పిస్తానని కాగితాలు రాసి ఇచ్చాడు. ఆ తర్వాత కంపెనీకి మక్కలు తరలించినా రైతులకు డబ్బులు ఇవ్వకపోగా ఏజెంట్ కానరావడం లేదు. దీంతో మంగళవారం అర్ధరాత్రి ఆయన ఇంటికి వచ్చినట్లు తెలుసుకుని లాలాపురం వాసులు ఆందోళన చేయగా పోలీసులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు బుధవారం పలువురు రైతులు బుధవారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తమకు డబ్బులు ఇప్పించాలని ఎస్‌ఐ జి.సూరజ్‌ను కోరారు. కంపెనీ ప్రతినిధులను గురువారం పిలిపించాక చర్యలు తీసుకుంటానని తెలిపారు. అయితే, సదరు ఏజెంట్ ముందుగానే డబ్బు తీసుకున్నాడని కంపెనీ ప్రతినిధులు చెబుతుండగా, తనకు రూ.25 లక్షలు కంపెనీ నుంచి రావాలని ఏజెంట్ చెప్పినట్లు సమాచారం.

12.9 కేజీల ఎండు గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లిలో డంపింగ్‌యార్డు పక్కన గుర్తు తెలియని వ్యక్తులు దాచిన 12.9 కేజీల ఎండు గంజాయిని ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని ఎవరు దాచారు? ఎక్కడి నుంచి తీసుకొచ్చారనే అంశంపై విచారణ చేస్తున్నట్లు సీఐ సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. కాగా, ఈ గంజాయి విలువ రూ.2 లక్షలు ఉంటుందని వెల్లడించారు. తనిఖీల్లో ఉద్యోగులు బాలు, విజయ్‌కుమార్, సుధీర్, హరీశ్, హన్మంతరావు, వెంకట్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి కార్మికుడి మృతి

కూసుమంచి: మండలంలోని కొత్తూరుకు చెందిన గీత కార్మికుడు పరిశబోయిన లక్ష్మయ్య (55) బుధవారం ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. లక్ష్మయ్య రోజు మాదిరిగానే ఉదయం కల్లు గీసేందుకు చెట్టు ఎక్కాడు. ఈ క్రమాన జారి కింద పడడంతో సహచరులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. గీత వృత్తితోనే కుటుంబాన్ని పోషిస్తున్న లక్ష్మయ్య మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువతి మృతి

సత్తుపల్లిటౌన్: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తాకడంతో షాక్‌కు గురైన యువతి మృతి చెందింది. సత్తుపల్లి మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన భూక్యా బేబీ (25) పశువులు కాసేందుకు బుధవారం సమీప పొలాల్లోకి వెళ్లింది. అక్కడ విద్యుత్ స్తంభం నుంచి కిందకు వేలాడుతున్న తీగ ఆమె తలకు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులతో స్తంభంపై కాసారం పగిలి తీగ వేలాడిందని విద్యుత్ ఏఈ కావ్య తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ ప్రతాపరెడ్డి తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు

ఖమ్మంలీగల్: హత్య కేసులో జిల్లాలోని తిరుమలాయపాలెం మండలం కుక్కలతండా గ్రామానికి చెందిన ముగ్గురికి జీవిత ఖైదు, మరో ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కుక్కలతండాకు చెందిన ఇస్లావత్ లచ్చిరాం, ఆయన అన్న, తమ్ముడు ఉమ్మడి ఆస్తిని 40 ఏళ్ల కిందట పంచుకున్నారు. ఈ భూమిలో 20 కుంటలు తనకు తక్కువగా వచ్చిందని లచ్చిరాం కోర్టును ఆశ్రయించారు. కేసు పెండింగ్‌లో ఉండగానే 2023 జూలై 23న బోడ రవి ఆ భూమిలో దున్నుతుండగా.. లచ్చిరాం కుమారులుఇస్లావత్ బద్రు, ఇస్లావత్ బాలు, కోడళ్లు విజయ, కవిత అడ్డుకున్నారు.దీంతో రవి, ఇస్లావత్ కిషన్, ఇస్లావత్ సేవాతో పాటు పలువురువీరిపై దాడి చేయగా భద్రు, బాలు, కవితకు గాయాలయ్యాయి. అనంతరం చికిత్స పొందుతూ భద్రు జూలై 29న మృతి చెందడంతో దాడి కేసునుహత్య కేసుగా మార్చారు. ఈ మేరకు పోలీసులు చార్జిషీట్ దాఖలుచేయగా, విచారణ అనంతరం బోడా రవి, ఇస్లావత్ కిషన్, ఇస్లావత్‌సేవాకు జీవితఖైదు, మిగిలిన ఏడుగురికి రూ.10 వేల చొప్పున జరిమానావిధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్‌ప్రాసిక్యూటర్ ఎ.శంకర్ వాదించగా, శ్రీకాంత్, భద్రాజీ, యూసుఫ్ సహకరించారు.